సాక్షి
జనగామ
ఆదివారం | 4 | జూన్ | 2023



రెగ్యులరైజ్ చేసేవరకు ఉద్యమిస్తాం..

రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేసే వరకు ఉద్యమిస్తామని జేఏసీ చీఫ్ ఆశీర్వాదం అన్నారు. - 10లో▸



ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన అర్చకులు

తెలంగాణ రాష్ట్ర సాధనకు సకల జనుల సమ్మెలో పాల్గొని ఉద్యమస్ఫూర్తిని రగిల్చిన అర్చకులను కాపాడుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని గంగు ఉపేంద్రశర్మ అన్నారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$41^0/28^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచే ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వేడి గాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వైభవంగా వార కల్యాణం



చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరాలయంలో శనివారం స్వామివారికి అర్చకులు రవీందర్ శర్మ, రంగాచార్యులు, కృష్ణచార్యుల ఆధ్వర్యంలో వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఏర్పాట్లను ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు పర్యవేక్షించగా.. తిరునగరి హరినాథ–లక్ష్మి, మనోహరస్వామి–శ్రీదేవి దంపతులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

నేడు పోలీస్ వాహన ర్యాలీ

జనగామ రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీస్ వాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి అన్నారు. సాయంత్రం 3 గంటలకు జిల్లాకు సంబంధించిన పోలీస్ ఆఫీసర్లకు కేటాయించిన వాహనాలతోపాటు బ్లూ కోర్ట్స్ పెట్రోకార్, ఇంటర్ సెప్టార్ వెహికిల్స్‌తో కలెక్టర్ కార్యాలయం నుంచి ఎస్‌ఆర్ గార్డెన్ వరకు ర్యాలీ సాగుతుందన్నారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభకు మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, రాజయ్య, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి హాజరవుతారని పేర్కొన్నారు.

సహస్ర దీపోత్సవం



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం సహస్ర దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ద ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈఓ లక్ష్మీప్రసన్న, అర్చకులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది రక్తదానం

జనగామ రూరల్: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పుట్టినరోజు సందర్భంగా శనివారం జిల్లా ఆస్పత్రిలో 20 మంది వైద్య సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ మేనేజర్ శ్రీనివాస్, డాక్టర్ రవీందర్, రాంనర్సయ్య, సుగుణాకర్ రాజు పాల్గొన్నారు.

ఆహ్వానించి అవమానపరిచారు..



రఘునాథపల్లి: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన రైతు దినోత్సవ కార్యక్రమానికి పిలిచి మాట్లాడనీయకుండా అవమానించారని రఘునాథపల్లి ఎంపీటీసీ పేర్ని ఉషారవి ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రొటోకాల్ పాటించకుండా స్థానిక సర్పంచ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అవమానించారన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు కూడా పంచాయతీ కార్యదర్శి సమాచారం ఇవ్వలేదని వాపోయారు.

అక్రమ అరెస్టులు సరికాదు



జనగామ రూరల్: అక్రమ అరెస్టులు సరికాదు.. భూపోరాటానికి అఖిలపక్షం పూర్తి మద్దతు ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. భూపోరాటాలపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ శనివారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అఖిల పక్షం నాయకులతో సాంబరాజు యాదగిరి అధ్యక్షతన జిల్లా కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు తీర్మానం ప్రవేశ పెట్టారు. టీపీసీసీ సభ్యుడు లక్ష్మీనారాయణ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజీ, బీఎస్పీ ఇన్‌చార్జ్ నీర్మాల రత్నం, టీడీపీ బాధ్యుడు రామినీ హరీశ్, డాక్టర్ మాచర్ల భిక్షపతి ప్రసంగించారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి ఉండగా ఆందోళనలను అణచివేయడమే కాకుండా నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. నెల్లుట్ల పటేల్‌గూడెం శివారులో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇర్రి అహల్య, జోగు ప్రకాశ్, చందు, పీఏసీఎస్ చైర్మన్ మల్లారెడ్డి, గోపి, జేరిపోతుల కుమార్, వెంకట మల్లయ్య, నరేందర్, సోమన్న, నాగరాజు, యాకయ్య, సారయ్య పాల్గొన్నారు.

చెప్పినట్టు వింటాం.. చెప్పింది చేస్తాం..

..ఇదీ కొందరు అధికారుల రాయబారం

- పోస్టింగ్‌ల కోసం మొదలైన పైరవీలు .
- మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లచుట్టూ ప్రదక్షిణలు
- మూడేళ్లకు మించి ఒకేచోట పనిచేసే వారికి స్థానచలనం
- బదిలీలకు గడువు జూలై 31.. ఎన్నికల సంఘం ఆదేశాలు
- రెవెన్యూ, పోలీస్‌శాఖల్లో పోస్టింగ్‌ల కోసం ఆరాటం
- ఎన్నికల కమిషన్ ఉత్తర్వులతో దూకుడు పెంచిన ఆశావహులు



సాక్షిప్రతినిధి, వరంగల్: అసెంబ్లీ ఎలక్షన్స్‌పై ఎన్నికల సంఘం (ఈసీ) కసరత్తు ఊపందుకున్న నేపథ్యంలో బదిలీల ప్రక్రియ కీలకంగా మారింది. దీంతో ఒకే జిల్లాలో మూడేళ్లుగా పనిచేస్తున్న, సొంత జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అధికారులు/ఉద్యోగులకు ఇక స్థానచలనం తప్పదు. వచ్చే ఎన్నికల ప్రక్రియలో వీరందరికీ భాగస్వామ్యం కల్పించకూడదని ఈసీ శుక్రవారం తీసుకున్న విధాన నిర్ణయం మేరకు ఉమ్మడి వరంగల్‌లో పలువురికి బదిలీ అనివార్యంగా మారనుంది. తహసీల్దార్ మొదలు కలెక్టర్ వరకు.. ఎస్‌ఐ మొదలు ఎస్పీల వరకు.. ఇలా వివిధ శాఖలకు చెందిన పలువురికి బదిలీలపై కసరత్తు మొదలైంది. 2024 జూన్ నాటికి మూడేళ్లు ఒకేచోట పనిచేసి ఉండకూడదన్న ఈసీ నిబంధనల మేరకు బదిలీల జాబితా సిద్ధం కానుంది. ఈ నేపథ్యంలో దీర్ఘకాలికంగా పూర్వ ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్ తదితర జిల్లాల్లో పనిచేస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులతో పాటు వివిధ శాఖలకు చెందిన పలువురు ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

కీలక స్థానాలపైన ఆశావహుల దృష్టి..

2024 జనవరిలోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడానికి గడువుగా ఈసీ పేర్కొనడంతో క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందించే పోలీసు, రెవెన్యూ అధికారుల బదిలీలు జోరుగా జరగనున్నాయి. ఎన్నికల సమయంలో వీరే కీలకం కావడంతో ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా మాట వినే వారిని తమ నియోజకవర్గాల్లోకి బదిలీపై తీసుకు వచ్చే ప్రక్రియ మొదలెట్టారు. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు ఎస్పీలు, ఇద్దరు అడిషనల్ డీసీపీలు, ముగ్గురు డీసీపీలు, ఎనిమిది మంది ఏసీపీ/డీఎస్పీ స్థాయి అధికారులు బదిలీల జాబితాలో ఉన్నారు. అదే విధంగా సుమారు 31మంది ఇన్‌స్పెక్టర్లు జిల్లాలు మారడం అనివార్యం. రెవెన్యూలో ఇద్దరు కలెక్టర్లు, ముగ్గురు అడిషనల్ కలెక్టర్లు, ఏడుగురు ఆర్‌డీఓలు ఎన్నికల సంఘం నిబంధనల కిందకు రానున్నారు. వీరితోపాటు 29 మంది తహసీల్‌దార్లకు స్థానచలనం తప్పనిసరి. దీంతో వారి స్థానంలో పోస్టింగ్‌లు పట్టేందుకు ఆశావహులు చేస్తున్న ప్రయత్నాలతో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీసులు కిటకిటలాడుతున్నాయి. గ్రేటర్ వరంగల్ కమిషనరేట్‌తో పాటు హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పనిచేసేందుకు పలువురు పోలీసు, రెవెన్యూ అధికారులు క్యూ కడుతున్నారు. బదిలీలు పూర్తిగా రాజకీయ జోక్యంతోనే జరుగుతున్నాయనేది బహిరంగ రహస్యమే కావడంతో ప్రయత్నాలు చేసుకోవడం తప్పదని ఓ డివిజనల్ స్థాయి రెవెన్యూ అధికారి వాపోయారు.

మనోడైతే చూడండి.. 'షాడో'లకు నేతల హింట్..

ఓ వైపు పోస్టింగ్‌ల కోసం ఆశావహుల ప్రయత్నాలు జోరందుకోగా.. ప్రజాప్రతినిధులు సైతం 'మనోడైతే చూడండి.. వేసుకుందాం' అని షాడో నేతలకు హింట్ ఇస్తున్నారు. కీలక ఎన్నికల సమయంలో నమ్మకస్తులుగా తమ సామాజికవర్గం వారైతేనే ఉంటారని ఉమ్మడి జిల్లాలోని ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు. చాలా చోట్ల బదిలీలు, పోస్టింగ్‌ల్లో వారు తమ సామాజికవర్గం వారికే ప్రాధాన్యమిస్తున్నారు. కొన్నిచోట్ల తమ సామాజికవర్గం వారి చేతుల మీదుగానే వ్యవహారాలను చక్కబెడుతున్నారు. మరోవైపు కొంతమంది అధికారులు ఏళ్ల నుంచి ఇక్కడే వివిధ పోస్టింగ్‌ల్లో పనిచేస్తున్నారు. తీవ్ర ఆరోపణలున్నా... ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకొని పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తుండగా ఆ పోస్టింగ్‌ల్లో కొనసాగుతున్న వారికి 'మూడేళ్ల' గండం పొంచి ఉంది. ఈసీ నిబంధనలకు బదిలీ అనివార్యం కావడంతో వారి స్థానాల్లో తమ అనుయాయులను దింపే ప్రయత్నాలు కూడా కొందరు చేస్తున్నట్లు ప్రచారం ఉంది. వరంగల్, హనుమకొండ, జనగామ, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లో ఈ ప్రక్రియ మొదలైంది. ఇదిలాఉంటే కొందరు ఆశావహులు జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలను ఆశ్రయిస్తుండగా.. మరికొందరు హైదరాబాద్ నుంచి, ఉన్నతస్థాయి రాజకీయ ఒత్తిళ్లు తీసుకువచ్చి తమకు అనుకూలమైన వారికి బదిలీ అయ్యేలా చక్రం తిప్పుతున్నారు. మొత్తానికి ఎన్నికల సంఘం ప్రకటనతో ఉమ్మడి జిల్లాలో బదిలీల ప్రక్రియ ఉద్యోగ, అధికారవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

ఉలికిపాటు..!

- కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఘటనతో ప్రజల బెంబేలు
- గుర్తుకొచ్చిన కాజీపేట సబ్ డివిజన్‌లో జరిగిన రైలు ఘటనలు

ఒడిశా రాష్ట్రం బాలాసోర్ వద్ద జరిగిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఘటనతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఎంతమంది చనిపోయారు.. అందులో తెలంగాణ వారు, అందులో ఉమ్మడి జిల్లా వారు ఎవరైన ఉన్నారా అని ఆరా తీస్తున్నారు. గతంలో జనగామ యశ్వంతపూర్ వాగులో నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్, వరంగల్‌లో జరిగిన గోల్కొండ ఘటనలను గుర్తు చేసుకుంటున్నారు.

- కాజీపేట రూరల్



వరంగల్‌లో 2003 సంవత్సరం జరిగిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఘటన(ఫైల్)



2008 సంవత్సరం గౌతమి ఎక్స్‌ప్రెస్ ఘటన (ఫైల్)

- 10లో▸

అదనపు కలెక్టర్‌గా రోహిత్‌సింగ్ బాధ్యతలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రోహిత్‌సింగ్

ప్రొఫైల్
పేరు : బి.రోహిత్‌సింగ్
భార్య : అపూర్వ
కూతురు : అనిక
తండ్రి : శివచరణ్
తల్లి : జయశ్రీ
స్వస్థలం : హైదరాబాద్
చదువు : ఇంజనీరింగ్, ఓయూ

జనగామ: నూతన అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బి.రోహిత్ సింగ్‌ను ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేయగా.. శనివారం కలెక్టర్ శివలింగయ్యను మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఉస్మానియా వర్సిటీలో ఇంజనీరింగ్ చేసిన రోహిత్ సింగ్ గ్రూప్ వన్ సర్వీస్‌లో మూడో ర్యాంకు సాధించారు. మిర్యాలగూడ ఆర్డీఓగా, నల్గొండ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(భూసేకరణ విభాగం)గా విధులు నిర్వర్తించారు. గతంలో ఇండియన్ ఆర్మీకి కూడా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు ధరణి ద్వారా అపరిష్కృత భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. దీర్ఘకాలిక భూసమస్యల విషయంలో రైతులు సంయమనం పాటించినప్పుడే న్యాయం చేకూరుతుందని సూచించారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించి నెలకు రూ.30వేలు గౌరవ వేతనం చెల్లించాలని డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రేషన్ డీలర్ల సమ్మె నేపథ్యంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన డీలర్లు డివిజన్ కేంద్రంలో గట్టు మొగిలిగౌడ్ అధ్యక్షతన ప్రత్యేకంగా సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. డీలర్లకు హెల్త్ కార్డులు ఇవ్వడంతోపాటు హమాలీ దిగుమతి క్వింటాల్‌కు రూ.12 ప్రభుత్వమే భరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగపురం మోహన్, మండల అధ్యక్షుడు ఐత వీరేశం, శత్రునాయక్, చింత శ్రీను, ఐత లింగయ్య, న్యాయం శోభారాణి, కవిత, ఇసాక్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలా రైతు దినోత్సవం

- ఊరూరా ట్రాక్టర్‌లు, ఎడ్లబండ్ల ర్యాలీలు
- వేడుకల్లో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు

జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శనివారం రైతు దినోత్సవాన్ని ఊరూరా రైతు వేదికల్లో ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 62 రైతు క్లస్టర్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆదర్శ రైతులను సన్మానించారు. ఒగ్గుడోలు, డప్పు కళాకారుల విన్యాసాలు, ట్రాక్టర్, ఎడ్లబండ్ల ర్యాలీలు నిర్వహించారు. కొడకండ్లలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ మండలం వడ్లకొండలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్, తాటికొండ, నమిలిగొండ, జఫర్‌గఢ్ మండల పరిధిలో ఎమ్మెల్యే రాజయ్య పాల్గొన్నారు. ప్రత్యేక రాష్ట్రం రాకముందు.. వచ్చిన తరువాత ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో వివరించారు. ఈ సందర్భంగా రైతులు తమ మనోగతాలను పంచుకున్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి పేర్కొన్నారు. గత పాలకులు వ్యవసాయం దండుగ అనగా ప్రస్తుతం పండుగ అయిందని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. ఒక్కో రైతు వేదికలో 1,000 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, రాష్ట్ర హార్టికల్చర్ కమిషనర్ ఎం.హన్మంతరావు, డీఏఓ వినోద్ కుమార్, డీఐఈఓ శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి లత, డీసీపీ సీతారాం, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, జెడ్పీటీసీ నిమ్మతి దీపిక మహేందర్‌రెడ్డి, ఎంపీపీ మేకల కళింగ రాజు, సర్పంచ్ బోల్లం శారద, సీఐ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లబండిపై వస్తున్న మంత్రి ఎర్రబెల్లి



రైతు పక్షపాతి సీఎం కేసీఆర్

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల: వ్యవసాయాన్ని పండుగలా మార్చిన సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏడునూతుల రైతు వేదికలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎదురు పెట్టుబడి ఇచ్చిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ సర్కారు అని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఏమైతదన్న విమర్శకులకు ఇదే సమాధానమని చెప్పారు. ధరణి ద్వారా రైతుల భూములకు భద్రత కల్పించడంతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఉత్తమ రైతులను మంత్రి సన్మానించారు. అంతకు ముందు ప్రజలు, రైతులు మంత్రికి ఘనస్వాగతం పలుకగా ఎడ్లబండి నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు.

- మరిన్ని చిత్రాలు 11లో▸


సర్కారు స్కూళ్లకు పూర్వవైభవం తేవాలి

- జిల్లా విద్యాధికారి రాము
- జయశంకర్ 'బడి బాట' ప్రారంభం

దేవరుప్పుల: తల్లిదండ్రులు తమ పిల్లల్ని సర్కారు స్కూళ్లలో చేర్పించి పూర్వవైభవం తేవాలని డీఈఓ రాము అన్నారు. శనివారం జిల్లాలో జయశంకర్ 'బడి బాట' కార్యక్రమం ప్రారంభమైంది. స్థానిక ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో కరపత్రాలు ఆవిష్కరించి ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పఠనా సామర్థ్యాన్నిబట్టి బోధన చేస్తారని, తద్వారా పిల్లల్లో ఆసక్తి పెరిగి విద్యాభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కొత్త అడ్మిషన్లు తీసుకున్నారు. సర్పంచ్ రమాదేవి, ఉపసర్పంచ్ దశరథ, ఎంపీటీసీ రేణుక, ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, హెచ్‌ఎంలు ఉపేందర్, అంజయ్య, డీసీఈబీ కార్యదర్శి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

బచ్చన్నపేట/జనగామ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. 'బడిబాట'లో భాగంగా బచ్చన్నపేట మండలం కొడవటూర్ జెడ్పీహెచ్‌ఎస్, జనగామ మండలం వడ్లకొండ పాఠశాలల్లో ఆయన మాట్లాడారు. సర్కారు స్కూళ్లలో ఉత్తమ ఉపాధ్యాయులచే బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన వసతి ఉంటుందన్నారు. హార్టికల్చర్ కమిషనర్ హన్మంతారావు, కలెక్టర్ శివలింగయ్య, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ రమణారెడ్డి, ఎంపీపీ నాగజ్యోతి, వైఎస్ ఎంపీపీ అనిల్‌రెడ్డి, సర్పంచ్ సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దేవరుప్పుల పాఠశాలలో పిల్లలతో డీఈఓ

కర్ణాటక ఓటమితో బీజేపీ ఊపు తగ్గింది



ముల్కనూర్‌లో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి: కర్ణాటక ఎన్నికల ఓటమితో బీజేపీ ఊపు తగ్గిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో జరిగిన వివాహ శుభకార్యాలకు హాజరైన అనంతరం ముల్కనూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మిజోరం, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ఎన్నికల ప్రకటన విడుదలైందన్నారు. దేశవ్యాప్తంగా దేశికి బచావో.. బీజేపీ హటావో అనే నినాదంతో సీపీఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రతో లౌకిక, ప్రజాస్వామిక, ప్రజాతంత్ర, వామపక్ష పార్టీలు ఒక తాటిపైకి రావాలనే చర్చ జరుగుతుందన్నారు. ఈనెల 12న ప్రతిపక్ష పార్టీలతో సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. కర్ణాటక ఎన్నికల్లో ఓటమితో తెలంగాణలో బీజేపీ ఊపు తగ్గిందని, తామె ప్రత్యామ్నాయం అనే పరిస్థితి రాష్ట్రంలో వారికి లేకుండా పోయిందన్నారు. అనూహ్యంగా అక్కడ మెజార్టీ సీట్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఉత్సాహం పెరిందని, ఇదే క్రమంలో కాంగ్రెస్‌లో సమన్వయ లోపం కనిపిస్తుందన్నారు. ఇటీవల ఈటల రాజేందర్ చేసిన ప్రకటనతో చేరికలు ఊహకు అందకుండా జారిపోయాయని, అది బీజేపీకి దెబ్బపడినట్టిందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు రానున్న ఐదు నెలల్లో ఉంటాయని పొత్తులు, సీట్ల అంశంలో పార్టీ సమావేశమై నిర్ణయాలు తీసుకుంటుందని, గెలిచే సీట్లపై చర్చిస్తామన్నారు. అనంతరం సివిల్స్ ర్యాంక్ సాధించిన సాయికిరణ్ ఇంటికి వెళ్లి సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యుడు అదారి శ్రీనివాస్, రాంచంద్రరెడ్డి, క్రిష్ణారెడ్డి, తిరుపతి, పిట్టల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ అధ్యాపకులకు సెలవులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని అన్ని విభాగాల, యూనివర్సిటీ కాలేజీల అధ్యాపకులకు ఈనెల 4వ తేదీ నుంచి 14వ తేదీ వరకు యూనివర్సిటీ అధికారులు సెలవులు ప్రకటించారు. ఈమేరకు శనివారం రాత్రి అన్ని విభాగాల అధిపతులు, యూనివర్సిటీ కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు వాట్సాప్ ద్వారా మేసేజ్‌లు పంపించగా.. వారు అధ్యాపకులకు సమాచారం అందించారు. అయితే ఇప్పుడు ఎందుకు సెలవులు ఇచ్చారనేది మెస్సేజ్‌లో పేర్కొనకపోవడం గమనార్హం. అయితే క్యాంపస్‌లో హాస్టళ్లు, మెస్‌లు యధావిధిగా కొనసాగనున్నాయి.

ఉలికిపాటు..!

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఘటనతో ప్రజల బెంబేలు

- గుర్తుకొచ్చిన కాజీపేట సబ్ డివిజన్‌లో జరిగిన రైలు ఘటనలు
- నిర్వహణ లోపం, ప్రైవేట్‌పరం బాటలో రైల్వే ప్రయాణం
- కాజీపేట మీదుగా వెళ్లే హౌరా ఎక్స్‌ప్రెస్ రద్దు



యశ్వంతపూర్ వాగు వద్ద బోల్తాపడిన రైలు బోగీ(ఫైల్)



వరంగల్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురికాగా సహాయక చర్యల్లో సిబ్బంది (ఫైల్)





అగ్నిప్రమాదానికి గురైన గౌతమి ఎక్స్‌ప్రెస్ (ఫైల్)

కాజీపేట రూరల్: కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఘటనతో ప్రజలు ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యారు. దేశంలో ఎక్కడైనా రైల్వే వ్యవస్థకు ఆటంకాలు, ప్రమాదాలు జరిగితే ఆ ప్రభావం కాజీపేట జంక్షన్‌పై పడుతుంది. చాలారైళ్లు కాజీపేట మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్ల మీదుగా ప్రతి రోజూ 200 వరకు రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. ఒడిశా రాష్ట్రం బాలాసోర్ వద్ద కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఘటన ఎలా జరిగింది.. ఎంతమంది చనిపోయారు, అందులో తెలంగాణ వారు ఎవరైనా.. ఉన్నారా.. ఉమ్మడి జిల్లావాసులు ఎవరైనా ఉన్నారా అని తెలుసుకునేందుకు ప్రజలు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో జరిగిన పలు రైలు దుర్ఘటనలను జనాలు మరోసారి గుర్తు చేసుకుంటున్నారు.

కాపలాలేని రైల్వేగేట్లు

కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో రైల్వేశాఖ కాపలా లేని రైల్వేగేట్లను ఎత్తివేసింది. కాజీపేట–ఆలేరు, వరంగల్ రూట్‌లో, హసన్‌పర్తి రూట్‌లో రైల్వే లెవెల్‌క్రాసింగ్ గేట్లు సుమారు 30 వరకు ఉన్నాయి. ఈ గేట్ల వద్ద గేట్‌మెన్లు విధులు నిర్వహిస్తున్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రవేశంతో 160 కేఎంపీహెచ్ స్పీడ్‌తో ఈ రైలు వెళ్తున్న నేపథ్యంలో రైల్వే గేట్ల స్థానంలో ఆర్‌యూబీ నిర్మాణాలు చేపట్టాలని రైల్వేశాఖ నిర్ణయించి అన్ని రైల్వే జోన్‌లకు ఆదేశాలు జారీ చేయగా అధికారులు ప్రతిపాదనల పనిలో నిమగ్నమయ్యారు.

టార్గెట్, ఎకనామీ పేరుతో

రైల్వే ఉన్నతాధికారులు వర్క్ టార్గెట్, ఎకనామీ, రైల్వే యూనిట్ల ఎత్తివేత, రైళ్ల నిర్వాహణ లోపం, ప్రైవేటీకరణ పేరుతో సిబ్బందిని కుదిస్తూ, తక్కువ మందితో ఎక్కువ పని చేయిస్తున్నారని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు. పెంచిన రైళ్లకు అనుగుణంగా సిబ్బందిని భర్తీ చేయడంలో రైల్వే విఫలమవుతోందని అంటున్నారు.

కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో జరిగిన రైలు దుర్ఘటనలు

- 1954 సెప్టెంబర్ 27న జనగామ జిల్లాలోని యశ్వంతపూర్ వాగులో నిజాముద్దీన్ (దక్షిణ్) ఎక్స్‌ప్రెస్ బోగీలు కొట్టుకుపోగా 300మంది మృత్యువాత పడ్డారు.
- 1983లో రాఘ్లపేట–ఆసిఫాబాద్ మధ్య తమిళనాడు ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ఘటనలో 640 మంది చనిపోయారు. అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంజీఆర్ ఘటన స్థలికి చేరుకున్నారు.
- 1986లో మంచిర్యాల–రవీంద్రఖని మధ్య బ్రిడ్జి వంతెన తెగడంతో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ బోగీలు కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో 300మంది ప్రయాణికులు మరణించారు.
- వరంగల్ రైల్వేస్టేషన్‌లో 2003 జూలై 2న గోల్కొండ ఎక్స్‌ప్రెస్ బ్రేక్‌లు ఫెయిల్యూర్ అయి షాండ్‌హంప్‌లోకి దూసుకెళ్లగా కంట్రోల్ కాక అండర్ బ్రిడ్జి కింద చేపల మార్కెట్‌పై బోగీలు పడ్డాయి. ఈ ఘటనలో 22మంది చనిపోయారు. 110మంది గాయపడ్డారు.
- 2008 జూలై 31న అర్ధరాత్రి గౌతమి ఎక్స్‌ప్రెస్ తాళ్లపూసపల్లి–కేసముద్రం మధ్య అగ్నిప్రమాదానికి గురై 21మంది మరణించారు.
- 2010లో జమ్మికుంట రైల్వేగేట్‌లో స్కూల్ బస్సును భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టిన ఘటనలో విద్యార్థి మృతిచెందాడు.
- 2006లో ఘన్‌పూర్– నష్కల్ రైల్వేస్టేషన్ల మధ్య వాగు వద్ద గోదావరి ఎక్స్‌ప్రెస్‌ను రైల్వే పెట్రోల్‌మెన్లు సూర్య, చంద్రంలు అప్రమత్తంగా వ్యవహరించి నిలిపి పెద్ద ప్రమాదాన్ని తప్పించారు.

ఎల్‌హెచ్‌బీ బోగీలు డేంజర్

ప్రస్తుతం ఎల్‌హెచ్‌బీ బోగీలను రైల్వేశాఖ ప్రవేశపెట్టి నడిపిస్తోంది. ఈ కోచ్‌లు చాలా తేలికపాటిగా ఉంటాయని, ట్రాక్‌పై త్వరగా వేగం అందుకుంటాయని రైల్వే నాయకులు అంటున్నారు. ఏమైన రైలు ప్రమాదాలు జరిగితే బోగీలు చల్లా చెదురైతాయని చెబుతున్నారు. గతంలో రైలు బోగీలు మందపు ఐరన్‌తో తయారు చేసేవని, ట్రాక్‌పై కావాల్సిన వేగంతో వెళ్లేవని, ప్రమాదాలు జరిగినప్పుడు బోగీల ప్రమాద తీవ్రత తక్కువగా ఉండేదని అంటున్నారు. కోరమండల్ ఘటనలో ఎల్‌హెచ్‌బీ బోగీలు ఉండడం వల్లే తీవ్రత పెరిగిందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దు

వరంగల్, కాజీపేట జంక్షన్ మీదుగా షాలిమార్–హైదరాబాద్ (18045) ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–షాలిమార్ (18046) ఎక్స్‌ప్రెస్‌ను దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం రద్దు చేస్తున్నట్లు ప్రకటించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఘటనతో ఈ రైళ్లను రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని రైళ్లను విజయవాడ అవతల రూట్‌లోనుంచి దారి మళ్లించి నడిపిస్తున్నట్లు వారు తెలిపారు.

రెగ్యులరైజ్ చేసేవరకు ఉద్యమిస్తాం..

- కేయూలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల మానవహారం



మానవహారం నిర్వహిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేసేవరకు ఉద్యమిస్తామని జేఏసీ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ ఆశీర్వాదం అన్నారు. ఈమేరకు శనివారం కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం ఎదుట మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆశీర్వాదం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కాంట్రాక్ట్ అసిస్టెంట్‌లు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఏండ్ల తరబడి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా కొనసాగుతున్నప్పటికీ రెగ్యులరైజ్ చేయడం లేదని ఆగ్రహించారు. ప్రభుత్వ పాలన వైఫల్యాల మూలంగా యూనివర్సిటీల్లో ఖాళీలను భర్తీ చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో 2 వేలమంది అన్ని విద్యార్హతలు ఉన్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారని, వారిని ఎందుకు రెగ్యులర్ చేయడం లేదని ప్రశ్నించారు. రెగ్యులరైజ్ చేస్తామని గతంలో సీఎం కేసీఆర్ చెప్పినా ఇప్పటికీ అమలు చేయలేన్నారు. కార్యక్రమంలో జేఏసీ కోఆర్డినేటర్ బైరి నిరంజన్, మామిడి లింగయ్య, ప్రవీణ్, వెంకటగోపినాథ్, శంకర్, రాజేశ్వరి, సునీత, యాకయ్య, శ్రీనివాస్, చంద్రశేఖర్, సూర్యం, వెంకట్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

రెజ్లర్లకు రక్షణ కరువు

- బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి
- ప్రజా సంఘాల డిమాండ్



సమావేశంలో పాల్గొన్న ఆచార్య కాత్యాయని విద్మహే, తదితరులు

హన్మకొండ: దేశానికి గౌరవం తెచ్చిన మహిళా రెజ్లర్లకు రక్షణ లేకుండా పోయిందని, మణిపూర్‌లోని నాగాలు, కుకీ తెగలకు రక్షణ కరువైందని ఆచార్య కాత్యాయని విద్మహే అన్నారు. విముక్త చిరుతల కక్షి (వీసీకే) పార్టీ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ జిల్లా సుబేదారిలోని ఈడెన్ గార్డెన్స్‌లో వీసీకే పార్టీ రాష్ట్ర నాయకుడు కొయ్యడ కిరణ్ అధ్యక్షతన రెజ్లర్ల సంఘీభావ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాత్యాయని విద్మహే మాట్లాడారు. ఫాసిస్టు పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో అవాంఛిత సంఘటనలు ప్రణాళిక ప్రకారం జరుగుతున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థకు అది ప్రమాదమన్నారు. న్యాయం కోసం పోరాడుతున్న రెజ్లర్లకు తెలుగు ప్రజలు అండగా నిలుస్తున్నారని ఈ సమావేశం చాటిచెప్పుతుందన్నారు. వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ సనాతన ఫాసిస్టు బీజేపీ ఈశాన్య రాష్ట్రాల్లో అశాంతికి కారణమవుతుందని, మణిపూర్‌లో జరుగుతున్న హింసకు బీజేపీ బాధ్యత వహించాలన్నారు. ఆరో షెడ్యూల్లో ఉన్న ప్రాంతాల్లో గిరిజనుల ఉనికి, సంస్కృతి ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. మైతేయి అనే గిరిజనేతరుల సమూహం మణిపూర్‌ను పాలిస్తూ, అక్కడి వనరుల నుంచి అసలైన ఆదివాసులను తరిమేయాలని చూస్తుందన్నారు. మైతేయి సమూహాన్ని గిరిజనుల్లో కలపాలని మణిపూర్ హైకోర్టు సలహా ఇచ్చిందని, తద్వారా నాగా, కుకీలు ఆందోళన చేపట్టారని అన్నారు. ఆందోళనకారుల మీద సాయుధ మైతేయిలు దాడులకు పాల్పడ్డారన్నారు. మిలటరీ బలగాలను దించి వందమంది నాగా, కుకీలను కాల్చి చంపారని, చనిపోయిన వారిని మిలిటెంట్లు అని ముద్రవేసి బీజేపీ ప్రభుత్వం దేశాన్ని తప్పుదోవపట్టిస్తున్నదన్నారు. బీసీ స్టడీ ఫోరం వ్యవస్థాపక చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ.. మహిళా రెజ్లర్లను వేధించిన బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలను వేధించిన వ్యక్తిని మోదీ కాపాడుతున్నాడని ఆరోపించారు. ఈ సమావేశంలో సోమ రామమూర్తి, నల్లెల రాజయ్య, చుంచు రాజేందర్, తిరుణహరి శేషు, శాగంటి మంజుల, భరత్, కన్నాల రవి, పోరిక ఈశ్వర్ సింగ్ నాయక్, చుక్కయ్య, సాయిబాబా, వీరాస్వామి, ఇర్ఫాన్, ముజాహిద్దీన్, తాడిశెట్టి క్రాంతి కుమార్, కొయ్యడ కిరణ్, అంబాల అనిల్, గుమ్మడి రాజుల సాంబయ్య, చెరుపల్లి ఆనంద్, మహేష్, బాబా ఖాదర్ అలీ, సమ్మయ్య రాథోడ్ పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి మృతి



భాస్కర్ మృతదేహం

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలానికి చెందిన ఇద్దరు వేర్వేరు చోట్ల.. వేర్వేరు కారణాలతో మృతి చెందినట్లు పోలీసులు శనివారం తెలిపారు. గుండెంగ శివారు వాగ్యతండాకు చెందిన మూడు భాస్కర్ (27) భార్య శారదతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ .. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం భాస్కర్ పనిచేస్తుక్రమంలో కరెంట్ షాక్‌కు గురై మృతిచెందాడు. విషయం తెల్సుకున్న తల్లిదండ్రులు మూడు హనుమ, శాంతి, బంధువులు గూడూరు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించి, హైదరాబాద్ వెళ్లి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు.

సీతానగరంలో..

మండలంలోని సీతానాగారానికి చెందిన ఉగ్గె కొమురయ్య (48) చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వారం క్రితం కొమురయ్య పంట చేను వద్ద పనిచేస్తున్నాడు. ఈక్రమంలో దాహం వేయడంతో తెలియకుండా గడ్డిమందు బాటిల్‌తో మంచినీరు తీసుకొని తాగాడు. దీంతో ఆ రోజు సాయంత్రం నుంచి కడుపు నొప్పితో బాధపడుతూ, మూడు రోజుల తర్వాత నర్సంపేటలోని ఓ ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. అతనికి కొమురయ్యకు భార్య లక్ష్మి, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాద మృతుల అంత్యక్రియలు పూర్తి

- స్వగ్రామంలో మిన్నంటిన బంధువులు, గ్రామస్తుల రోదనలు
- నివాళులర్పించిన ఎమ్మెల్యే రెడ్యానాయక్, వివిధ పార్టీల నాయకులు



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

దంతాలపల్లి: దేవుడి దర్శనానికి సంబురంగా వెళ్లి.. మేనళ్లుడి పుట్టువెంట్రుకలు తీసి ఆనందంగా వెనుదిరిగిన ఆ కుటుంబంలోని నలుగురిని రోడ్డు ప్రమాదం రూపంలో ముంచుకొచ్చిన మృత్యువు మింగేసింది. వీరికి శనివారం స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. వివరాలిలా ఉన్నాయి.. జూన్ 1న తిరుపతి, శ్రీకాళహస్తి మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన నెమ్మది వెంకటమ్మ (60) కుమారులు దినేష్‌కన్నా అలియాస్ వెంకన్న(40), అశోక్(32), దినేష్‌ఖన్నా కూతురు శాన్వితాక్షరి (5) మృతిచెందారు. దినేష్‌కన్నా, అశోక్‌ల మేనళ్లుడి పుట్టువెంట్రుకలు తీయడానికి తిరుపతి వెళ్లి వస్తున్న క్రమంలో వీరు ప్రయాణిస్తున్న కారు ఆర్టీసీ బస్సును ఢీ కొట్టడంతో నలుగురు మృతిచెందారు. కాగా, శనివారం నలుగురి మృతదేహాలకు స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు రామచంద్రనాయక్, వద్దిరాజు రామచంద్రరావు, లక్ష్మణ్‌నాయక్ తదితరులు మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, గురుకుల డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఏ (ఎల్) కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు శనివారం షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈమేరకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 13, 15, 17, 20, 22, 24, 27, 30, జూలై 4వ తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాల్గవ సెమిస్టర్ పరీక్షలు 14, 16, 19, 21, 23, 26, 28, జూలై 3, 5, 7 తేదీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 13, 15, 17, 20, 22, 24, 27, 30, జూలై 4, 6, 10, 11, 12, 13, 14 తేదీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పీజీ సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ కోర్సుల సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) జూలై 5వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 5, 7, 10, 12, 14, 18 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు ఉంటాయని వెల్లడించారు.

ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన అర్చకులు

- తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేంద్రశర్మ
- అర్చకులకు ఘనంగా సన్మానం



అర్చకులను సన్మానిస్తున్న గంగు ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సకల జనుల సమ్మెలో పాల్గొని రోడ్డు మీద పిండ ప్రదానాలు, హోమాలు, పూజలు జరిపి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి రగిల్చిన రాష్ట్రంలోని 21కులాల అర్చకులను కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ అన్నారు. శనివారం సాయంత్రం హనుమకొండ రాగన్న దర్వాజలో గల బ్రాహ్మణభవనంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గంగు ఉపేంద్రశర్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పాత పదిజిల్లాలకు చెందిన 21కులాల అర్చకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో 12,260 దేవాలయాలు ఉంటే 10వేల దేవాలయాలకు ప్రభుత్వ ఖజానా నుంచి వేతనాలు అందిస్తుందని తెలిపారు. సనాతన హిందూ ధర్మాన్ని అనుసరించి వివిధ కులాల అర్చక వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చక వెల్ఫేర్ బోర్డు రాష్ట్ర సభ్యులు జక్కాపురం నారాయణస్వామి, శివపురం రామలింగరాధ్య, ఏటూరి ఆంజనేయులు, 21 కులాల అర్చకులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ముగ్గురి మృతి



మహేందర్ (ఫైల్)



రాజు (ఫైల్)

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రానికి చెందిన జెట్టి మహేందర్ (35) వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేందర్ ధాన్యం కొనుగోలు కేంద్రానికి గత కొన్ని రోజులుగా హామాలి పని వెళ్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం కూడా పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి అస్వస్థతతో కుప్ప కూలిపోయాడు. మహేందర్ వడదెబ్బకు గురైనట్లు గుర్తించి వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మహేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదిలాఉండగా.. వడదెబ్బతో మృతి చెందిన మహేందర్‌ది పేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలకు పలువురు విరాళాలు అందచేశారు. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ మండల అధ్యక్షుడు చొక్కం సదయ్య రూ.10వేలు, మండలకేంద్రానికి చెందిన సేవ్ లైఫ్ ఆర్గనైజేషన్ సభ్యులు రూ.30వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

చెన్నారావుపేటలో యువరైతు..

చెన్నారావుపేట: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో శనివారం ఓ యువరైతు వడదెబ్బతో మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారావుపేటకు చెందిన పర్కాల కొంరయ్య–లక్ష్మీల కుమారుడు రాజు(38) వ్యవసాయ బావి వద్దకు పనుల నిమిత్తం వెళ్లాడు. పనులు ముగించుకొని ఇంటికి వచ్చి వాంతులు, విరేచనాలు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. రాజుకు భార్య స్వప్న, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఫతేషాపూర్‌లో ఆటో డ్రైవర్..



శ్రీనివాస్ (ఫైల్)

రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని ఫతేషాపూర్‌లో శుక్రవారం వడదెబ్బతో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. గ్రామానికి చెందిన గుగ్గిళ్ల శ్రీనివాస్ అలియాస్ జ్యోతి (46) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఆటో నడుపుతూ ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకొచ్చారు. రాత్రి వాంతులు చేసుకుంటూ తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందాడు. శనివారం ఆటో డ్రైవర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శ్రీనివాస్‌కు భార్య సుజాత, కుమారుడు, కూతురు ఉన్నారు.

ఎస్సార్ యూనివర్సిటీ వీసీగా దీపక్ గార్గ్



దీపక్ గార్గ్

హసన్‌పర్తి: ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ దీపక్ గార్గ్ నియమితులయ్యారు. ఈమేరకు ఎస్సార్ యూనివర్సిటీ చాన్సలర్ ఎ.వరదారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏబిపై ఎస్‌పీడీబీఏ–బీవీ పరిశోధన కేంద్రానికి డైరెక్టర్‌గా, వివిధ అంకుర పరిశ్రమలు, వెంచర్ ఫండ్స్‌కు సాంకేతిక సలహాదారుడిగా దీపక్ గార్గ్ వ్యవహరించారు. అనేకమంది పరిశోధకులు దీపక్ గార్గ్ పర్యవేక్షణలో డాక్టరేట్ అందుకున్నారు ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలుగా చేపట్టిన దీపక్ గార్గ్ మాట్లాడుతూ.. ఎస్సార్‌ను రోల్‌మోడల్‌గా మార్చడమే తన లక్ష్యమన్నారు. దీపక్ గార్గ్‌కు అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.